
కనగానపల్లిలో నిమజ్జనానికి తరలిపోతున్న వినాయకులు


బత్తలపల్లి మండలం రామాపురం వద్ద చిత్రావతి నదిలో నిమజ్జనం చేస్తున్న దృశ్యం


ముదిగుబ్బలో నిమజ్జనానికి తరలిపోతున్న వినాయకుడు

గంగ ఒడికి గణనాథులు

సాక్షి బృందం : వినాయక చవితి సందర్భంగా ఊరూ.. వాడా కొలువుదీరిన గణనాథులు పలు ప్రాంతాల్లో మూడో రోజు శుక్రవారం వినాయక నిమజ్జనం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కదిరి, గాండ్లపెంట, తనకల్లు, బత్తలపల్లి, తాడిమర్రి, ఎన్పీకుంట తదితర మండలాల్లో ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వినాయక ప్రతిమలను ఆటోలు, ట్రాక్టర్ తదితర ప్రత్యేక వాహనాల్లో కొలువుదీర్చి డ్రమ్స్ వాయిద్యాల నడుమ భక్తుల కోలాహలం మధ్య నీటిలో నిమజ్జనం చేశారు. జై బోలో గణేశ్ మహరాజ్‌కీ జై.. గణపతి బప్ప మోరియా నినాదాలు ప్రతిధ్వనించాయి. అంతకుముందు భక్తులకు అన్నదానాలు చేశారు. గణేశుని లడ్డూ ప్రసాదాల వేలం పోటీలు పోటాపోటీగా సాగాయి. అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు బందోబస్తు పర్యవేక్షించారు.


తాడిమర్రిలో అన్నదానం


తలుపులలో నిమజ్జనానికి సిద్ధమైన వినాయకుడు


ఎన్పీకుంటలో నిమజ్జనానికి తరలుతున్న వినాయకుడు


గాండ్లపెంట మండలం జీనులకుంటలో నిమజ్జనానికి...


ఎన్పీ కుంట మండలం గోవిందురాజులపల్లిలో గణనాథుని లడ్డూతో..


చెన్నేకొత్తపల్లిలో వినాయకుడి ఊరేగింపు

క్లుప్తంగా

'సంస్కృతి'కి అటానమస్ హోదా


కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకుంటున్న సంస్కృతి యాజమాన్యం

పుట్టపర్తి అర్బన్: పుట్టపర్తి సమీపంలోని సంస్కృతి ఇంజినీరింగ్ కళాశాలకు అటానమస్ హోదా లభించినట్లు చైర్మన్ విజయ్‌భాస్కర్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం కళాశాలలో యాజమాన్యం అధ్యాపకులతో కలిసి కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల యాజీసీ అధికారికంగా 'అటానమస్' హోదా ప్రకటించిందన్నారు. 10 సంవత్సరాల పాటు అటానమస్ హోదా ఉంటుందని పేర్కొన్నారు. కళాశాలను ప్రారంభించిన అతి తక్కువ సమయంలోనే న్యాక్‌-ఏ గ్రేడ్ ప్రకటించిందన్నారు. నాణ్యమైన విద్య, వసతులు, విద్యా నైపుణ్యాలు బోధన, ఉత్తీర్ణత శాతం, ప్లేస్‌మెంట్ బాగుండడంతో ఈ గుర్తింపు లభించిందని ప్రిన్సిపాల్ హేమచంద్ర పేర్కొన్నారు. ఇందుకు కారణమైన వారందరికీ కృతజ్ఞతలు చెప్పారు కార్యక్రమంలో డైరెక్టర్ అశోక్‌రెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీల కమిటీ ఎంపిక


కమిటీని ఎంపిక చేస్తున్న నాయకులు

ధర్మవరం: ధర్మవరం ఐసీడీఎస్ ప్రాజెక్టు అంగన్‌వాడీల సంఘం నూతన కమిటీని ఎంపిక చేసినట్లు జిల్లా ప్రధాన కార్యదర్శి శ్రీదేవి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకటేష్, ఏపీ రైతు సంఘం జిల్లాప్రధాన కార్యదర్శి జంగాలపల్లి పెద్దన్నన, జేవీ రమణ తెలిపారు. పట్టణంలోని లక్ష్మీచెన్నకేశవస్వామి ఆలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన సమావేశంలో అంగన్‌వాడీల కమిటీ నూతన అధ్యక్షురాలుగా విజయలక్ష్మి, కార్యదర్శిగా దీనా, కోశాధికారిగా అరుణ, ఉపాధ్యక్షురాలుగా బీబీ ఫాతిమా, సహాయ కార్యదర్శులుగా గంగరత్న, రాధ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు.

ట్రాన్స్‌ఫార్మర్ ధ్వంసం



నల్లమాడ: దొన్నికోట గ్రామం యర్రచెరువు సమీపాన ముద్దల నరసింహులు వ్యవసాయ బావి వద్ద మూడు రోజుల క్రితం గుర్తు తెలియని వ్యక్తులు ట్రాన్స్‌ఫార్మర్‌ను ధ్వంసం చేసి, అందులోని విలువైన వైరును ఎత్తుకెళ్లారు. బాధిత రైతు శుక్రవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

మాజీ జవాన్ డబుల్ ధమాకా!

- అటు పోలీస్‌– ఇటు టీచర్ పోస్టుకుఎంపిక


రమణ

నల్లమాడ: ఓ మాజీ జవాన్ రెండు ప్రభుత్వ కొలువులతో మెరిశాడు. మసకవంకపల్లికి చెందిన చాగలేటి రమణ బీఏ, బీఎడ్, బీఎల్ఐసీ చదివారు. 2000 సంవత్సరంలో ఆర్మీకి ఎంపికై అహ్మద్‌నగర్, జమ్మూకశ్మీర్, కోల్‌కతా, ఢిల్లీలో జవాన్‌గా పనిచేశాడు. 2018లో రిటైర్డ్ అయ్యాక ప్రభుత్వ ఉద్యోగం కోసం సన్నద్ధమయ్యాడు. ఇటీవల పోలీస్ కానిస్టేబుల్ ఎంపిక పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించాడు. ఈలోపు డీఎస్సీ నోటిఫికేషన్ పడటంతో పరీక్ష రాసి నాన్ లోకల్ కింద కర్నూలు జిల్లాలో ఎస్జీటీగా ఎంపికయ్యాడు. భార్య వనజ లక్ష్మి (హోంగార్డు), బావ రెడ్డెప్ప (కానిస్టేబుల్), మేనల్లుడు భానుప్రకాష్, ఇంటర్ చదువుతున్న కుమారుడు పృథ్వీరాజ్ సూచనలు, సలహాలతో క్రమశిక్షణగా చదివి ఉద్యోగం సాధించానని రమణ తెలిపాడు. రెండింటిలో ఏ ఉద్యోగంలో చేరాలో ఇంకా నిర్ణయించుకోలేదని చెప్పాడు.

క్రీడల్లో ప్రోత్సహించాలి

ధర్మవరం: నేటి పోటీ ప్రపంచంలో చదువుతో పాటు క్రీడల్లోనూ విద్యార్థులను ప్రోత్సహించాలని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉదయ్ భాస్కర్ తెలిపారు. పట్టణంలోని కాకతీయ విద్యానికేతన్ ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా వివిధ క్రీడా పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ఆయన మెడల్స్, కప్ అందించారు. కార్యక్రమంలో కాకతీయ విద్యానికేతన్ కరస్పాండెంట్ నిర్మలాదేవి, డైరెక్టర్లు శెట్టిపి సూర్యప్రకాష్‌రెడ్డి, పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థిని, విద్యార్థులు పాల్గొన్నారు.

పుట్టపర్తి : బుక్కపట్నం సత్యసాయి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. ఆర్డీఓ సువర్ణ మాట్లాడుతూ క్రీడల్లో సత్తా చాటి రాష్ట్ర, దేశ ప్రతిష్ఠను మరింత ఇనుమడింప చేయాలన్నారు. ప్రిన్సిపాల్ మగ్బూల్ హుస్సేన్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి హరికృష్ణ, తహసీల్దార్ నరసింహులు తదితరులు పాల్గొన్నారు.

ముదిగుబ్బ: ముదిగుబ్బలోని బాలికల ఉన్నత పాఠశాలలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవంతో పాటు తెలుగు భాషా దినోత్సవాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఎంఈఓ రమణప్ప ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

రహస్య వేలంపై భగ్గుమన్న కౌన్సిల్

- అధికారుల తీరుపై సభ్యుల ఆగ్రహం
- వేలం పాట రద్దుకు ఏకగ్రీవ తీర్మానం

ధర్మవరం: మున్సిపల్ కాంప్లెక్స్‌ల్లో దుకాణాలకు అధికారులు రహస్యంగా వేలం పాట నిర్వహించి సంస్థ ఆదాయానికి గండి కొట్టారని వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు జేసీబీరమణ, గోరకాటి పురుషోత్తంరెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణం ఆ వేలం పాటను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. శుక్రవారం మున్సిపల్ కౌన్సిల్ హాలులో చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి అధ్యక్షతన కమిషనర్ ప్రమోద్‌కుమార్ ఆధ్వర్యంలో కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. తొలుత వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు జేసీబీరమణ, గోరకాటి పురుషోత్తంరెడ్డి మాట్లాడుతూ ఇటీవల నిర్వహించిన మాలగుండ్ల పెదయ్య మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌లో 1వ నంబర్ దుకాణానికి నిర్వహించిన వేలం పాటలో రూ.10.25 లక్షలకు అమర్ అనే వ్యక్తికి గుడ్‌విల్ పద్ధతిలో కట్టబెట్టడం పట్ల అభ్యంతరం వ్యక్తం చేశారు. గతంలో ఈ సముదాయంలో ఒక్కో దుకాణం రూ.30 లక్షల నుంచి రూ. 50 లక్షలు గుడ్‌విల్ పద్ధతిన ఇతర వ్యాపారులు దక్కించుకున్నారని గుర్తు చేశారు. అలాంటిది అంత తక్కువ ధరకు అధికారులు షాపును కట్టబెట్టడేమిమటని ప్రశ్నించారు.


అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్న వైఎస్సార్‌సీపీ కౌన్సిలర్లు

పట్టణ నడిబొడ్డున ఉన్న షాపింగ్ కాంప్లెక్స్‌కు ఇద్దరు పోటీదారులతోనే వేలం పెడతారా అని నిలదీశారు. అలానే కాయగూరల మార్కెట్‌లోని సముదాయంలో గతంలో రూ.9 లక్షలు గుడ్‌విల్‌కు ఇతర వ్యాపారులు పాట పాడి దుకాణాలు దక్కించుకున్నారన్నారు. ప్రస్తుతం అధికారులు రహస్య వేలం పాట ద్వారా రూ.5.30 లక్షలకే కట్టబెట్టడం వెనుక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇందుకు స్పందించిన చైర్‌పర్సన్ కాచర్ల లక్ష్మి కమిషనర్‌ను వివరణ కోరారు. నిబంధనల మేరకే వేలం పాట నిర్వహించామని కమిషనర్ బదులివ్వగా చైర్‌పర్సన్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. వేలం పాట నిర్వహణపై చైర్‌పర్సన్‌కు కూడా సమాచారం ఇవ్వలేదని.. ఇంక ఎంత చిత్తశుద్ధితో నిర్వహించారో ఇట్టే అర్థమవుతోందని మండిపడ్డారు.

వేలం పాట రద్దుకు ఏకగ్రీవ తీర్మానం

మున్సిపాలిటీ ఆదాయానికి గండి కొట్టేవిధంగా నిర్వహించిన వేలం పాటను రద్దు చేస్తూ కౌన్సిల్ సభ్యులు ఏకగ్రీవ తీర్మానం చేయడంతో చైర్‌పర్సన్ ఆమోదం తెలిపారు. మళ్లీ పారదర్శకంగా వేలం పాట నిర్వహించాలని అధికారులను ఆదేశించారు.

- పట్టణంలోని హిందూ శ్మశానవాటికలోకి వెళ్లడానికి దారి లేక ఇబ్బందులు పడుతున్నట్లు కౌన్సిలర్ కేతాలో కేష్ కౌన్సిల్ దృష్టికి తెచ్చారు. రానున్న దసరా, నామదార్ల పండుగ సందర్భంగా సమాధుల వద్దకు వెళ్లి పూజలు చేస్తారని, అక్కడ సరైన సదుపాయాలు కల్పించాలని కోరారు. బాలాజీ నగర్ బండగుంత వద్ద మున్సిపల్ నిధులతో ప్రహరీ నిర్మించేందుకు అజెండాలో పెట్టారని, అసలు ఆ బండగుంత స్థలం ప్రైవేట్ వ్యక్తులదని, ఆ యజమానులతో ఖర్చు పెట్టించాలే తప్ప ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయకూడదని కౌన్సిలర్లు మాసపల్లి సాయికుమార్, చందమూరి నారాయణరెడ్డి అన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ షంషాద్ బేగం, ఇంజినీరింగ్, రెవెన్యూ, మెప్మా అధికారులు, కౌన్సిలర్లు, కోఆప్షన్ సభ్యులు పాల్గొన్నారు.

కూటమి పాలనలో వ్యవసాయ రంగం నిర్వీర్యం

పుట్టపర్తి టౌన్: కూటమి ప్రభుత్వ పాలనలో వ్యవసాయరంగం నిర్వీర్యమైందని జిల్లా వ్యవసాయ సలహా మండలి మాజీ చైర్మన్ అవుటాల రమణారెడ్డి విమర్శించారు. శుక్రవారం పుట్టపర్తిలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. జిల్లాలో 60 శాతానికి పైబడి వ్యవసాయంపై ఆధారపడి జీవిస్తున్నారన్నారు. 2.20 లక్షల ఎకరాల సాగు భూమి ఉండగా.. కేవలం లక్ష ఎకరాల విస్తీర్ణంలో పంటలు వేశారన్నారు. ప్రస్తుతం వర్షాలు సమృద్ధిగా కురుస్తున్నాయని, అవసరమైన ఎరువులు, విత్తనాలు అందించడంలో ప్రభుత్వం విఫలమైందని ధ్వజమెత్తారు. గత వైఎస్సార్‌సీపీ పాలనలో 412 రైతు భరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులను సకాలంలో అందజేశామని గుర్తు చేశారు. వ్యవసాయ సలహా మండలి ద్వారా పంటలపై రైతులకు శిక్షణలిచ్చినట్లు తెలిపారు. పంటల బీమా ప్రీమియం సైతం ప్రభుత్వమే భరించి రైతులపై భారం పడకుండా చూసిందన్నారు. నాడు విత్తు నుంచి పంట విక్రయం వరకు రైతులకు అడుగడుగునా అండగా ప్రభుత్వం ఉండేదన్నారు. ప్రస్తుతం కూటమి సర్కారు వ్యవసాయరంగాన్ని నిర్లక్ష్యం చేస్తోందని మండిపడ్డారు. ఇకనైనా ప్రభుత్వం విత్తనాలు, ఎరువులు కొరత లేకుండా చూడాలని, కృషి విజ్ఞాన కేంద్రం ఏర్పాటు చేయాలని, ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాలని, కోళ్లు, పొట్టేళ్లు, పాడి పరిశ్రమ అభివృద్ధికి సబ్సిడీ రుణాలు అందించాలని కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ తుంగా ఓబుళపతి, పార్టీ వాణిజ్య విభాగం రాష్ట్ర కార్యదర్శి చెరువు భాస్కర్‌రెడ్డి, పట్టణ కన్వీనర్ రవినాయక్, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు కన్యాకుమారి, సింగిల్‌విండో మాజీ అధ్యక్షులు రుషికేశవరెడ్డి, ఎస్సీ సెల్ నియోజవర్గ అధ్యక్షులు గంగిశెట్టి, సోషల్ మీడియా నియోజవర్గ అధ్యక్షులు ఇర్ఫాన్, కో ఆప్షన్ సభ్యులు రఫీ, మాజీ కౌన్సిలర్ నారాయణరెడ్డి, విజయకుమార్‌నాయక్ తదితురులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న అవుటాల రమణారెడ్డి

హామీల అమలులో విఫలం

నల్లచెరువు: ఎన్నికల హామీల అమలులో కూటమి ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మొండెం రవికుమార్‌రెడ్డి విమర్శించారు. శుక్రవారం మండలంలోని కె.పూలకుంట, ఉబిచర్ల పంచాయతీల్లో కన్వీనర్ ఆధ్వర్యంలో 'బాబు ష్యూరిటీ–మోసం గ్యారెంటీ' కార్యక్రమం నిర్వహించారు. కె.పూలకుంట సర్పంచ్ యూసుఫ్, ఎంపీటీసీలు భాస్కర్‌రెడ్డి, నరసింహారెడ్డితో పాటు వైఎస్సార్‌సీపీ నాయకులతో కలిసి ఇంటింటికీ వెళ్లి బాబు హామీల అమలు తీరుకు సంబంధించి క్యూఆర్ కోడ్ ద్వారా ప్రజలకు వివరించారు. సూపర్ సిక్స్ సహా 143 హామీలను అమలు చేయకుండా.. వాటిని దృష్టి మరల్చేందుకు పీ–4 అనే కొత్త నాటకానికి తెరలేపారని విమర్శించారు. కార్యక్రమంలో పార్టీ మండల వైస్ కన్వీనర్ రఫీ, సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, పోరెడ్డి వెంకటరెడ్డి, మాజీ సర్పంచులు అక్బర్, రమణారెడ్డి, మహిళా కన్వీనర్ గౌరమ్మ, మైనార్టీ నాయకులు నజీర్, డైరెక్టర్లు గోవిందురెడ్డి, ఆదిమూర్తి, యూత్ కన్వీనర్ మన్సూర్ బాషా, ఎస్టీ సెల్ హైటెక్ రమణ, ట్రేడ్ యూనియన్ కన్వీనర్ ఖాదర్ వలి, బీసీ మండల కన్వీనర్ చిన్నపల్లి హరి, కార్యదర్శి సలీం, కృష్ణ మూర్తి, మైనార్టీ కన్వీనర్ ఫయాజ్ తదితరులు పాల్గొన్నారు.


క్యూఆర్ కోడ్ ఆవిష్కరిస్తున్న వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ రవికుమార్‌రెడ్డి

జల సంరక్షణ బాధ్యత అందరిదీ

ఎన్పీకుంట: జల సంరక్షణ బాధ్యత మనందరిపై ఉందని ఎఫ్ఈఎస్ సంస్థ సభ్యులు పేర్కొన్నారు. ప్రపంచ జల వారోత్సవాల్లో భాగంగా వెలిచలమల పంచాయతీలో ఎఫ్ఈఎస్ సంస్థ ఆధ్వర్యంలో ఇండస్ ఇండ్ బ్యాంక్ ఆర్థిక సహకారంతో చేపట్టిన నీటి సంరక్షణ పనులను పల్లె సంఘం సభ్యులతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ప్రపంచ వ్యాప్తంగా మారుతున్న వాతావరణ పరిస్థితులను బట్టి నీటిని ఎలా సంరక్షించుకోవాలనే విషయాలను వివరించారు. ఉమ్మడి వనరుల ద్వారా భూగర్భజలాలు పెంపొందించుకోవడం, నీటి కాలుష్యాన్ని అరికట్టి భవిష్యత్ తరాల వారికి నీటిని సమృద్ధిగా అందించే విషయాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో వెటర్నరీ డాక్టర్, ఉపాధి హామీ, ఎఫ్ఈఎస్ సిబ్బంది, పల్లె సంఘం సభ్యులు పాల్గొన్నారు.

కదిరిలో 2న నిమజ్జనం


ధర్మవరం జర్నలిస్ట్ కాలనీలో చిన్నారుల చిందులు


కదిరి శివాలయం వీధిలో వినాయక విగ్రహం

కదిరి టౌన్: కదిరి మున్సిపల్ పరిధిలో వివిధ రూపాల్లో 130 వినాయక విగ్రహాలు పూజలందుకుంటున్నాయి. శివాలయంవీధి, గొల్లబామ్మ మండపం, అడపాలవీధి, వేమారెడ్డి సర్కిల్, రాజేంద్ర ప్రసాద్ వీధి, మారుతీనగర్ తదితర ప్రాంతాల్లో అన్నీ పెద్ద విగ్రహాలే. ఏడు రోజుల పూజల అనంతరం అక్టోబర్ రెండో తేదీన నిమజ్జనం నిర్వహించనున్నారు.

అంగరంగ వైభవంగా గణేష్ వేడుకలు

ధర్మవరం: పట్టణంలోని జర్నలిస్ట్ కాలనీలో వినాయక చవితి సంబరాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. శుక్రవారం కాలనీలోని భక్తులు పెద్ద ఎత్తున స్వామి వారిని దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

క్రీడలతోనే ఉజ్వల భవిత

ధర్మవరం అర్బన్: క్రీడలతోనే ఉజ్వల భవిత ఉందని, ప్రతి విద్యార్థీ చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించేలా తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కాకతీయ విద్యానికేతన్ కరస్పాండెంట్ నిర్మలాదేవి తెలిపారు. హాకీ పితామహుడైన ధ్యాన్‌చంద్, తెలుగు వ్యవహారిక భాషా ఉద్యమ పితామహుడు గిడుగు వెంకటరామ్మూర్తి జయంతిల సందర్భంగా జాతీయ క్రీడా దినోత్సవం, తెలుగుభాషా దినోత్సవాలను పురస్కరించుకుని శుక్రవారం వారి చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులు పలు క్రీడల్లో ప్రతిభ చూపారు. తెలుగుభాష గొప్పతనాన్ని వివరించేలా తెలుగుదనం ఉట్టిపడేలా విద్యార్థులు వివిధ కవులు, కవయిత్రులు, రచయితల వేషధారణలో అలరించారు. కార్యక్రమంలో కాకతీయ విద్యానికేతన్ డైరెక్టర్‌లు శెట్టిపి సూర్యప్రకాష్‌రెడ్డి, పద్మ, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో...

కేహెచ్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో పీడీ ఆనంద్ ఆధ్వర్యంలో జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ధ్యాన్‌చంద్ చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం యూనివర్సిటీ తరఫున ఇటీవల ఆడిన ఆరుగురు క్రీడాకారులను వారు అభినందించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ చిట్టెమ్మ, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

తెలుగు ఔన్నత్యం చాటాలి

కదిరి: పట్టణంలోని షిర్డీ సాయి ఇంగ్లిష్ మీడియం పాఠశాలలో అకడమిక్ డైరెక్టర్ పసుపులేటి సూర్యతేజ ఆధ్వర్యంలో శుక్రవారం మాతృభాషా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. తెలుగుభాష ఔన్నత్యాన్ని ప్రపంచ వ్యాప్తంగా చాటి చెప్పాలని వక్తలు పిలుపునిచ్చారు. ఆంగ్లం, హిందీ ఇలా ఎన్ని భాషలు నేర్చుకున్నా మాతృభాష తెలుగును ఎప్పటికీ మరువరాదని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు వ్యాసరచన, వక్తృత్వ పోటీలు నిర్వహించి.. ప్రతిభ కనబరచిన వారికి బహుమతులు అందజేశారు.


ధర్మవరంలో వివిధ వేషధారణల్లో విద్యార్థులు


ఉపాధ్యాయులను సన్మానిస్తున్న దృశ్యం

కదిరి అర్బన్: కదిరిలోని ఎస్టీఎస్ఎన్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శుక్రవారం తెలుగుబాషా దినోత్సవమైన గిడుగు రామ్మూర్తి పంతులు జయంతిని ఘనంగా నిర్వహించారు. తెలుగుబాషాభివృద్ధికి ఆయన చేసిన సేవలను కొనియాడారు. అలాగే కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ స్మితతో పాటు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ధర్మవరం: తెలుగుభాష దినోత్సవాన్ని పురస్కరించుకుని తెలుగు ఉపాధ్యాయులను సన్మానించినట్లు ఉషోదయ పాఠశాల కరస్పాండెంట్ చాంద్‌బాషా, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ షంషాద్‌బేగం తెలిపారు. పట్టణంలోని కొత్తపేటలోనున్న ఉషోదయ పాఠశాలలో శుక్రవారం తెలుగు భాష దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగు ఉపాధ్యాయులు నాగేషు, నాగభూషణంలను శాలువాలతో సన్మానించారు. ఉపాధ్యాయులు, విద్యార్థులు తెలుగుభాష– సంప్రదాయం ఉట్టిపడేలా వస్త్రధారణలతో ఆకట్టుకున్నారు.

క్రీడలతో మానసిక దృఢత్వం

నల్లమాడ: జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా శుక్రవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి ఆధ్వర్యంలో పీఈటీ నాగభూషణ పర్యవేక్షణలో విద్యార్థులకు కబడ్డీ, ఖోఖో, లాంగ్ జంప్ తదితర పోటీలు నిర్వహించారు. హెచ్‌ఎం మాట్లాడుతూ క్రీడలు విద్యార్థుల్లో మానసిక దృఢత్వాన్ని పెంచి చదువులో రాణించేందుకు దోహదపడతాయని తెలిపారు.

క్రీడల్లో రాణించండి

ధర్మవరం: నాగలూరు వద్దనున్న రూపరాజా పీసీఎంఆర్ పాఠశాలలో శుక్రవారం జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. హాకీ మాంత్రికుడు ధ్యాన్‌చంద్ జయంతిని జాతీయ క్రీడా దినోత్సవంగా జరుపుకుంటున్నట్లు పాఠశాల చైర్మన్ హర్షవర్ధన్ విద్యార్థులకు తెలియజేశారు. చదువుతో పాటు క్రీడల్లోనూ రాణించాలని సూచించారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు రూపరాజాకృష్ణ, జగదీష్, కరస్పాండెంట్ నాగమోహన్‌రెడ్డి, ప్రిన్సిపాల్ నరేష్‌కుమార్‌రెడ్డి, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా తెలుగుభాష, క్రీడా దినోత్సవాలు

ధర్మవరం అర్బన్: పట్టణంలోని ప్రభుత్వ బాలుర ఉన్నత పాఠశాలలో శుక్రవారం లయన్స్‌క్లబ్ ఆధ్వర్యంలో తెలుగుభాష దినోత్సవం, జాతీయ క్రీడా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. లయన్స్ క్లబ్ అధ్యక్షుడు ఎ.రమేష్‌బాబు, కార్యదర్శి నాగేంద్ర, కోశాధికారి వెంకటేష్‌కుమార్‌ల సమక్షంలో తెలుగు పండితులు జయసింహ, కొత్తగా పీడీలుగా ఉద్యోగాలు సాధించిన రామకోటి, నాగార్జున, మల్లేష్, ప్రతాప్‌లను శాలువాలు, పూలమాలలతో ఘనంగా సత్కరించారు. ప్రతి విద్యార్థి తెలుగుభాష మాట్లాడుతాం తెలుగుభాషలోనే చదువుతాం అంటూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో లయన్స్‌క్లబ్ సభ్యులు పిట్టా వెంకటస్వామి, పల్లెం వేణుగోపాల్, గోసే రాధాకృష్ణ, వేణుగోపాలాచార్యులు, వెంకట పార్థసారధి, రాజీ తదితరులు పాల్గొన్నారు.


క్రీడల గొప్పతనాన్ని వివరిస్తున్న ఉపాధ్యాయులు


నల్లమాడలో కబడ్డీ ఆడుతున్న విద్యార్థులు


ఉపాధ్యాయులు, నూతన పీడీలను సన్మానిస్తున్న లయన్స్‌క్లబ్ సభ్యులు

తెలుగుభాషను మరవకూడదు


సమావేశంలో మాట్లాడుతున్న కళాజ్యోతి అధ్యక్షుడు కుంటిమల నారాయణ

ధర్మవరం అర్బన్: మాతృభాష తెలుగును ఎవ్వరూ మరువకూడదని కళాజ్యోతి అధ్యక్షుడు కుంటిమల నారాయణ, కార్యదర్శి రామకృష్ణ, జనప్రియ కవి ఏలూరు యంగన్న అన్నారు. ధర్మవరంలోని కళాజ్యోతిలో శుక్రవారం రాత్రి తెలుగు మాతృభాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలుగుభాష తల్లిలాంటిదన్నారు. ఆంగ్లభాషా వ్యామోహంలో పడకుండా తెలుగుభాషకు ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. అనంతరం నాట్యాచార్యులు పట్నం శివప్రసాద్ ఆధ్వర్యంలో శ్రీగురుకుప్ప సంగీత నృత్య కళానికేతన్ విద్యార్థులు కూచిపూడి నృత్య వైభవం, జానపద నృత్యాలతో అలరించారు. కార్యక్రమంలో కళాజ్యోతి డైరెక్టర్లు రమేష్, మధుసూదన్, శింగనమల రామకృష్ణ, జగ్గా వేణుగోపాల్, రాంప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణుడి విగ్రహం ఊరేగింపు

రొళ్ల: గంతికల్లుగొల్లహట్టిలో యాదవ కులస్తులు శుక్రవారం శ్రీకృష్ణుడి విగ్రహ ఊరేగింపు ఘనంగా చేపట్టారు. మహిళలు పిండితో చేసిన జ్యోతులను మోసుకుని పురవీధుల్లో ఊరేగింపు వచ్చి శ్రీకృష్ణుడికి సమర్పించారు.